

కేసుల పరిష్కారానికి సహకరించాలి

» జిల్లా ప్రధాన న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్ రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మార్చి 8న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన కేసులను పరిష్కరించేందుకు పోలీసులు పూర్తి సహకారం అందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. గురువారం జిల్లా కోర్టు ఆవరణలో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. చిన్నచిన్న తగాదాలు, మోటారు వెహికిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు రాజీపడేలా చూడాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిషోర్, జిల్లా న్యాయ సేవా కార్యదర్శి డీబీ శీతల్, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్, పీపీలు దీపారాణి, అన్వేష్ సింగ్, సమీనాబేగం, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ నిర్మాణాలకు స్థల పరిశీలన



కమిషనర్ శశాంక్‌కు వివరాలు తెలియజేస్తున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించడానికి వివిధ మండలాల్లో గురువారం రాష్ట్ర ఫ్లాగ్‌షిప్ స్కీమ్స్ కమిషనర్ శశాంక్ స్థలాలను పరిశీలించారు. కూకట్‌పల్లిలోని సర్వే నంబర్ 1009లోని స్థలంతోపాటు కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలోని సర్వే నంబర్ 220లోని 20 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని, కాప్రా మండలంలోని జవహర్‌నగర్‌లోని సర్వే నంబర్ 12లోని 20 ఎకరాల స్థలాన్ని కలెక్టర్ గౌతమ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయా స్థలాల మ్యాప్‌ను వివరించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి అన్ని రకాలుగా అనువైన సలాలను గుర్తించి పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, ఆర్డీవోలు ఉపేందర్‌రెడ్డి, శ్యాంప్రకాష్, తహసీల్దార్లు స్వామి, సుచరిత, తదితరులు పాల్గొన్నారు.





పాడి రైతుల పరేషాన్!

పాల బిల్లులు అందక అవస్థలు

అప్పుల ఊబిలో 'మదర్ డెయిరీ'
డిసెంబర్ నుంచి నిలిచిన బిల్లు చెల్లింపులు
రూ.కోట్లలో పేరుకుపోయిన బకాయిలు
పరిగి సొసైటీకే రూ.80లక్షల బకాయి
అయోమయంలో పాడిరైతులు

'మదర్ డెయిరీ'కి పాలు పోసే రైతులు కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నారు. రూ.కోట్లలో పాల బకాయిలు పేరుకుపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. కుటుంబ పోషణకు ఆస్తులు కుదవపెట్టుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదిహేను రోజులకోసారి చెల్లించాల్సిన బిల్లులు నాలుగు నెలలైనా అందకపోవడంతో రోడ్డెక్కి ఆందళన చేస్తున్నారు. వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పాలను రోడ్డుపై పారబోసి నిరసన వ్యక్తం చేస్తున్నారు.



కుర్మిద్ద మదర్ డెయిరీ కేంద్రం వద్ద పాలు పారబోస్తున్న రైతులు (ఫైల్)

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

హైదరాబాద్ మహానగరం, చుట్టు పక్కల ప్రాంతాల్లో ఏడాదంతా పాలకు ఎంతో డిమాండ్ ఉంటుంది. నగరం, చుట్టుపక్కల గ్రామాల్లో డెయిరీ పెట్టుకుని రూ. లక్షలు గడిస్తున్న వారు కోకొల్లలు. అయితే ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న మదర్ డెయిరీని నమ్ముకున్న రైతులు మాత్రం ఉసూరుమంటున్నారు. కొన్ని నెలలుగా వారికి మదర్ డెయిరీ నుంచి చెల్లింపులు లేవు. దీంతో ఉమ్మడి రంగారెడ్డిజిల్లాలో అనేక మంది రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉమ్మడి నల్గొండ, రంగారెడ్డిజిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం (మదర్ డెయిరీ) మూడున్నర దశాబ్దాలుగా పాడి రైతులకు భరోసాగా ఉండేది. పాడి రైతులను ప్రోత్సహించేందుకు దాణా, మందులు సబ్సిడీపై ఇస్తూ లబ్ధిచేకూర్చేది. అయితే తరువాత సొసైటీలో రాజకీయాలు చోటు చేసుకోవడంతో

మిగతా 7వ పేజీలో...

గతంలో పాడి రైతులకు లీటర్‌కు రూ.4 బోనస్ ఇచ్చారు. అయితే కొంత కాలంగా బోనస్ నిలిపివేశారు. దీనికి తోడు పాల రేటు కూడా గణనీయంగా తగ్గించేశారు. వాస్తవానికి బహిరంగ మార్కెట్‌లో పాల ధరలు తగ్గిన దాఖలాలు లేవు. పాల ధర తగ్గించి అమ్మినా మదర్‌డెయిరీకి పాలు విక్రయించే రైతులకు ఎలాంటి మేలు జరగడంలేదు.

బోనస్ ఊసే లేదు

పైగా తాము అమ్మిన పాలకు డబ్బులు కూడా సకాలంలో ఇవ్వడం లేదు. పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల్లో పాలు విక్రయించిన రైతులకు నెలకు రెండు సార్లు అంటే ప్రతి నెల 5వ తేదీన తరువాత 20వ తేదీన చెల్లింపు చేసేవారు. కానీ నాలుగేళ్లుగా ఈ అనవాయితీ ప్రకారం చెల్లింపులు జరగడం లేదు. ఇప్పుడు పరిస్థితి మరింత దారుణంగా మారింది. డిసెంబర్ నుంచి రైతులకు ఒక్క రూపాయి కూడా ఇంతవరకు చెల్లించ లేదు

ముందస్తు ప్రణాళికతో మంచి ఫలితాలు

» డీఈవో రేణుకాదేవి

పరిగి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. పరిగిలోని జడ్పీహెచ్ఎస్ నం.01 పాఠశాలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రీ ఫైనల్ పరీక్షలను పరిశీలించారు. అనంతరం డీఈవో విద్యార్థులతో మాట్లాడారు. మంచి ప్రణాళికతో పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. పరీక్షలటే భయం వద్దని, శ్రద్ధతో చదువుకోవాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల వెన్ను తట్టి ప్రోత్సహించాలన్నారు. త్వరలో జరుగనున్న వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో గోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉడికించిన చికెన్‌తో నష్టం లేదు

వికారాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉడికించిన చికెన్ తినడం వల్ల ఎలాంటి నష్టం లేదని వికారాబాద్ పశు సంవర్ధక, పశు వైద్య సహాయ సంచాలకుడు డాక్టర్ పూర్ణచంద్రరావు గురువారం ప్రకటనలో తెలిపారు. చికెన్‌ను 70 డిగ్రీల వద్ద ఉడికిస్తే చికెన్‌లో ఉన్న వైరస్ చనిపోతుందని, అది తినడం వల్ల ఎలాంటి ముప్పు ఉండదని పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం ఇదే విషయాన్ని స్పష్టం చేసిందని గుర్తుచేశారు. వికారాబాద్‌కు హైదరాబాద్ నుంచి కోళ్లు సరఫరా అవుతాయని తెలిపారు. అక్కడి నుంచి వచ్చే కోళ్లకు ఎలాంటి వ్యాధులు సోకలేదని, వికారాబాద్ ప్రాంత ప్రజలు నిర్భయంగా చికెన్, కోడిగుడ్లను తినవచ్చని సూచించారు.

స్టేడియాల నిర్మాణానికి కృషి

» శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
» అంతర్ జిల్లా కబడ్డీ చాంపియన్ షిప్ పోటీలు ప్రారంభం



కబడ్డీ పోటీల జెర్సీని ఆవిష్కరిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఇండోర్, అవుట్ డోర్ స్టేడియాల కోసం ఐదెకరాలు, స్టేడియాల నిర్మాణానికి రూ.7 కోట్ల మంజూరుకు కృషి చేస్తామని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. గురువారం వికారాబాద్ పట్టణంలోని గౌలికార్ ఫంక్షన్ హాలులో జరుగుతున్న 34వ సబ్ జూనియర్ అంతర్‌జిల్లా బాల, బాలికల కబడ్డీ చాంపియన్ షిప్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడలు, వ్యాయామానికి కొంత సమయం కేటాయించాలన్నారు. కబడ్డీ మన జాతీయ క్రీడ అని, క్రీడాకారులకు ఎప్పుడూ ఆదరణ ఉంటుందన్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహిస్తానని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి క్రీడాకారులను ప్రోత్సహించడానికి స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కేసీఆర్ ప్రభుత్వ పదేళ్ల పాలన క్రీడలను విస్మరించిందని ఆరోపించారు. అనంతరం ధన్నారంలోని గడ్డమైసమ్మ ఆలయ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆలయం వరకు రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీ డైరెక్టర్ కిషన్‌నాయక్, నాయకులు సుధాకర్ రెడ్డి, సత్యనారాయణ, రత్నారెడ్డి, నరోత్తంరెడ్డి, చిగుళ్లపల్లి రమేష్, మహిపాల్‌రెడ్డి, సాయి, కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు పరశురాం, మురళి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర నిధులతోనే గ్రామాల అభివృద్ధి

» సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సభ్యుడు నరోత్తం రెడ్డి

కోట్‌పల్లి, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సభ్యుడు నరోత్తం రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని బీరోల్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి సహకారంతో రూ.5 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు కృష్ణయాదవ్, వెంకటేశం చారి, జగన్‌రెడ్డి బీరోల్ బూత్ అధ్యక్షుడు భానూరి ధన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, సామల వెంకట్ రెడ్డి, కమాల్‌రెడ్డి, కుర్రి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి

స్థానిక ఎన్నికల్లో బీజేపీదే గెలుపు

పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి

మర్పల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి అన్నారు. గురువారం మర్పల్లి మండల కేంద్రంలోని పాత బస్టాండ్ ఆవరణలో ఎంపీ నిధులు రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనతో ప్రజలు విసుగుచెందారని, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం అయ్యిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై బీజేపీ వైపు చూస్తున్నారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజ్, రాష్ట్ర నాయకుడు రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేశ్, మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, నాయకులు బల్‌రామ్‌గౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలకే పరిమితం!

కీసరగుట్ట అభివృద్ధి పట్టని నేతలు.. ముందుకు కదలని ప్రణాళికలు



24వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు
ఏటేటా పెరుగుతున్న భక్తుల తాకిడి
ఆ మేరకు పెరగని సౌకర్యాలు
కనుమరుగవుతున్న చరిత్ర ఆనవాళ్లు
పట్టించుకోని అధికారులు

మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవ క్షేత్రమైన కీసరగుట్ట భవానీశివదుర్గ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి చేసిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. ఏటేటా ఆలయానికి భక్తుల తాకిడీ పెరుగుతున్నా.. ఆ మేరకు సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతుంది. ఆరేళ్ల క్రితం ఆలయాభివృద్ధికి చేసిన ప్రతిపాదనల్లో ముందడుగు పడడం లేదు. ఏటా నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో లక్షల మంది భక్తులు పాల్గొంటారు. అందుకు తగ్గట్లుగా సౌకర్యాలు కల్పించకపోవడంతో భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నెల 24 నుంచి మార్చి 1వ తేదీ వరకు

మిగతా 8వ పేజీలో...

మరుగుదొడ్లకు మరమ్మతులేవి?



కీసర, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రిని పురస్కరించుకొని నిర్వహించే కీసరగుట్ట రామలింగేశ్వరాలయం ఉత్సవాలకు సిద్ధమవుతున్నా వసతుల లేమి వెక్కిరిస్తోంది. లక్షలాదిగా తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం నిర్మించిన శాశ్వత మరుగుదొడ్ల డోర్లు విరిగిపోయి తొంగి చూస్తున్నాయి. గుట్ట దిగువన కీసరవాణీ, హరిత రిసార్ట్ సమీపంలో మరుగుదొడ్లు, స్నానాల గదులు కొన్ని నిర్మించారు. భక్తుల తాకిడికి సరిపడా చలువ పందిళ్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానపు గదులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో శాశ్వత మరుగుదొడ్లకు మరమ్మతులు చేయడం లేదు. డోర్లు, ఇతరత్ర పనులు చేయకుండానే కాంట్రాక్టర్ పెయిటింగ్ పనులు పూర్తి చేస్తున్నాడు. అధికారులు గుర్తించి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. ఈ విషయంపై సదురు కాంట్రాక్టర్ సైదులును వివరణ కోరగా అది నా పరిధిలోకి రాదని మాట దాటేశాడు.

నేడు పోలెపల్లిలో ఎల్లమ్మ సిరిమానోత్సవం

హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి » వైభవంగా కొనసాగిన పల్లకీసేవ

దుద్యాల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): భక్తుల కొంగు బంగారం పోలెపల్లి ఎల్లమ్మ ఆలయ ఉత్సవాలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి పల్లకీసేవ పురవీధుల గుండా కొనసాగింది. ఈ కార్యక్రమంలో కళాకారుల నృత్యాలు అలరించాయి. శుక్రవారం సిడె కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకాన్ను నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పాత సిడే రథం శిథిలావస్థకు చేరడంతో దాతలు అయినపూరం సంజీవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు రూ.14.50 లక్షలు సమకూర్చి రథాన్ని తయారు చేయించారు. గురువారం కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. రేగడిమైలారానికి చెందిన అంజిలప్ప పాడిన పాటల సీడీని కలెక్టర్ ఆవిష్కరించారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఐజీ

పోలెపల్లి ఎల్లమ్మ ఆలయ ఉత్సవాలకు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానుండటంతో మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ ఎస్పీ నారాయణరెడ్డితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఆయన వెంట జిల్లా అదనపు ఎస్పీ హనుమంతరావు, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పల్లకీసేవలో కళాకారుల నృత్యాలు

ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించండి


ప్రభుత్వ స్థలం వివరాలను చూపుతున్న బక్కని నర్సింహులు, ఎస్.రాజు

షాద్‌నగర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ శివారులో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు డిమాండ్ చేశారు. గురువారం ఆయన షాద్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని 171 సర్వే నంబర్‌లో ఐదు ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమి ఉందన్నారు. అప్పట్లో ఇందులో కొంత విలేకరులకు ఇళ్ల స్థలాలకు, అలాగే గొర్రెల కాపరుల సంఘానికి కొంత కేటాయించారన్నారు. మిగతా భూమి అన్యాక్రాంతమైందన్నారు. ఈ సర్వే నంబర్‌లో మొత్తం ఎంత భూమి ఉంది? ఎవరెవరికి కేటాయించారు? మిగతా భూమి ఎవరు ఆక్రమించారో తేల్చేందుకు అధికారులు సర్వే చేయించాలన్నారు. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్న వారు ఆ స్థలాన్ని ప్రభుత్వానికి స్వాధీనం చేయాలన్నారు. ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు జరుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎం నాయకుడు రాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోకుంటే ఉద్యమాలు చేస్తామన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం

చౌదరిగూడ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి):వ్యక్తిగత పరిశుభ్రతతోనే మనిషి ఆరోగ్యంగా ఉంటాడని షాద్‌నగర్ హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్ సూచించారు. గురువారం కొందర్గు కేజీబీవీలో గురువారం విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం వ్యక్తిగత పరిశుభ్రతపై అవగహన కల్పించారు. శరీరం, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రోజూ ఉదయం కాలకృత్యాలు తీర్చుకుని పళ్లు తోమడం, నోటిని శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ రాగిని, సిబ్బంది అన్నపూర్ణ, లోకనాథ్ పాల్గొన్నారు.


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్


సైన్స్ ఆర్ట్స్‌లో ప్రతిభ కనబర్చిన కళాకారులతో విద్యార్థిని పూజాచారి

సైన్స్ ఆర్ట్స్‌లో పూజాచారి ప్రతిభ

● గవర్నర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం

చౌడాపూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జెఎన్‌టీయూ)లో గురువారం నిర్వహించిన ఆర్ట్స్ సోసైటీ 84వ ఆల్ ఇండియా వార్షిక ఎగ్జిబిషన్‌లో చౌడాపూర్ మండలం మరికల్ గ్రామానికి చెందిన స్కాలర్ వడ్ల పూజాచారి స్టోన్ కార్వింగ్‌లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా ఆమె గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ప్రశాంసా పత్రం, రూ.25వేల నగదు అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని పూజాచారి మాట్లాడుతూ.. కళలో తనను ప్రోత్సహించిన చిత్రలేఖనం ఉపాధ్యాయులు ప్రణీత, కృష్ణాచారిలకు ధన్యవాదాలు తెలిపారు.

ఢిల్లీ రాజకీయాల్లో చారిత్రక ఘట్టం ఆవిష్కృతం

● బీజేపీ జిల్లా సీనియర్ నాయకుడు కుంచం శ్రీనివాస్‌గుప్తా



చేవెళ్ల, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా బీజేపీ అధిష్టానం రేఖగుప్తాను నియమించడంతో దేశ రాజధాని రాజకీయాల్లో ఓ చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైందని రంగారెడ్డి జిల్లా బీజేపీ సీనియర్ నాయకుడు కుంచం శ్రీనివాస్‌గుప్తా అన్నారు. గురువారం ఢిల్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆయన చేవెళ్లలో మాట్లాడుతూ... ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖగుప్తాను నియమించడం సంతోషకరమన్నారు. రేఖాగుప్తా నాయకత్వంలో ఢిల్లీ మరింత అభివృద్ధి సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నిబద్ధత, ప్రజలకు ఉన్నత సేవలు అందించే రేఖాగుప్తా ఢిల్లీని అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతారని అన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రిగా నియమితులైన రేఖాగుప్తా కుటుంబీకులు వ్యవసాయ మార్కెట్‌లో చిన్న కమిషన్ వ్యాపారం చేస్తున్నారని చెప్పారు. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి పదవులు దక్కడం బీజేపీలోనే సాధ్యం అన్నారు. రేఖాగుప్తా కూడా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సభ్యురాలిగా, ఏబీవీపీ మెంబర్‌గా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారని తెలిపారు. సీఎం రేఖాగుప్తాకు ఆర్యవైశ్య సంఘం తరుపున, బీజేపీ తరుపున శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు స్పష్టం చేశారు.

ఎన్ఎస్ఎస్‌తో సేవాగుణం అలవడుతుంది


మాట్లాడుతున్న అనురాగ్ వర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లేశ్

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి):ఎన్ఎస్ఎస్‌తో విద్యార్థుల్లో, యువతలో సేవా దృక్పథం అలవడుతుందని అనురాగ్ యూనివర్సిటీ ప్రోగ్రాం ఆఫీసర్ సి.మల్లేశ్ అన్నారు. గురువారం యూనివర్సిటీ యూనిట్ 2, 3 సమ్మర్ క్యాంప్‌లను ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పడమటి సోమారం, మక్త అనంతారం గ్రామాలను దత్తత తీసుకున్నట్లు తెలిపారు. ఈ గ్రామాల్లో సదుపాయాలు కల్పించేలా ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వీధుల్లో చెత్త తొలగించారు. ప్లాస్టిక్ వాడకం నిషేధం, కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటు హక్కుపై వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ డీన్ విజయకుమార్, లెక్చరర్లు పురుషోత్తం, శ్రీనివాస్, కోటేశ్వర్‌రావు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రచారమే తప్ప ప్రగతి లేదు!


కానుగుబావి తండాలో పర్యటిస్తున్న దశరథ్‌నాయక్ తదితరులు

కడ్తాల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): నిరుపేదలందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ జె.దశరథ్‌నాయక్ అన్నారు. గత ప్రభుత్వంలో ప్రారంభించి నిలిచిన పనులకు నిధులు కేటాయించి పూర్తిచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కడ్తాలలో, కానుగుబావి తండాలో గురువారం దశరథ్ పర్యటించారు. మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామకృష్ణలతో కలిసి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. కాంగ్రెస్ గ్యారంటీలపై ఆ పార్టీ నాయకులను ప్రజలు నిలదీయాలని సూచించారు. ప్రచారమే తప్ప 15 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రగతేమీ లేదని విమర్శించారు. కార్యక్రమంలో లాయక్‌అలీ, మహేశ్, దాసు, శ్రీకాంత్, కిషన్, వెంకటేశ్, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి

ఎకో టూరిజం కార్యక్రమాలు


ఎకో టూరిజం కార్యక్రమంలో ఔత్సాహికులు

గచ్చిబౌలి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి మార్చి 30 వరకు ప్రతి వీకెండ్ శనివారం, ఆదివారం తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఎకో టూరిజం కార్యక్రమాలను రూపొందించింది. అందులో భాగంగా ఉదయం 6.30 నుంచి 9:30 గంటల వరకు ట్రెక్కింగ్, నేచర్ ట్రయల్ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. 23న వికారాబాద్ అనంతగిరి హిల్స్‌లో ఉదయం 7 నుంచి 10గంటల వరకు బర్డ్‌వాక్, మార్చిన 1న ఫారెస్ట్ ట్రెక్కింగ్ పార్క్‌లో మధ్యాహ్నం 3 నుంచి మరుసటి రోజు ఉదయం 10 నుంచి నేచర్ క్యాంప్, 2న సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఫారెస్ట్‌లో ఉదయం 7 నుంచి 10గంటల వరకు బర్డ్‌వాక్, మార్చి 8న ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో మధ్యాహ్నం 3 నుంచి మరుసటి రోజు ఉదయం 10గంటల వరకు నేచర్ క్యాంప్, మార్చి 9న ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో ఉదయం 6:30 నుంచి 9:30 గంటల వరకు బర్డ్ వాక్, మార్చి 15న ఫారెస్ట్ ట్రెక్ పార్కులో మధ్యాహ్నం 3 నుంచి ఉదయం 10గంటల వరకు నేచర్ క్యాంప్, 16న ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో ఉదయం 6:30 నుంచి 9:30 గంటల వరకు ట్రెక్కింగ్, నేచర్ ట్రయల్, 22న ఫారెస్ట్ ట్రెక్ పార్కులో మధ్యాహ్నం 3 నుంచి ఉదయం 10గంటల వరకు నేచర్ వాక్, 23న వికారాబాద్ అనంతగిరి హిల్స్‌లో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు బర్డ్‌వాక్, ట్రెక్కింగ్, 29న మధ్యాహ్నం 3 నుంచి ఉదయం 10గంటల వరకు నేచర్ క్యాంప్, 30న గజ్వేల్ ఫారెస్ట్‌లో ఉదయం 7నుంచి 10గంటల వరకు బర్డ్‌వాక్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. రాష్ట్రంలో ఎకో టూరిజాన్ని ప్రోత్సహించేందుకు అడవులపట్ల, జంతువులపట్ల, పక్షులపట్ల ప్రజల్లో అవగాహన కల్పించే దిశగా స్థిరమైన పర్యాటక అభివృద్ధికి అడుగులు వేసేలా తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ డెక్కన్‌వుండ్స్ ట్రయిల్స్ పేరుతో ప్రతీ శని, ఆదివారాలు అనేక కార్యక్రమాలు రూపొందించినట్లు ఎకో టూరిజం సంస్థ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ రంజిత్‌నాయక్ వివరించారు. వీటిల్లో పాల్గొనేందుకు ఆసక్తిగల వారు 9493549399, 9346364583 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



రైతుల చిరకాల స్వప్నం.. ఎత్తిపోతల పథకం సాకారం

- మరాఠా, కన్నడ రాష్ట్రాల మీదుగా పరుగులు తీస్తున్న కృష్ణానది
- భీమా నికర జలాలతో కొడంగల్, నారాయణపేట ప్రాంతాలు సస్యశ్యామలం
- నేడు లిఫ్ట్‌పై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష



కొడంగల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి):వెనకబడిన కొడంగల్ ప్రాంత రైతుల చిరకాల స్వప్నం కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకం త్వరలోనే సాకారం కానుంది. కొడంగల్, నారాయణపేట, మక్తల్ ప్రాంతాల రైతులకు చెరువుల ద్వారా సాగు నీరందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో పథకానికి శ్రీకారం చుట్టారు. గవర్నర్ పాలనలో 2014లో జీవో 69 అమలుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పథకం అమలుకు చర్యలు చేపట్టారు. కొడంగల్, నారాయణపేట లిఫ్ట్ రూపకల్పనకు సీఎం రేవంత్ రెడ్డి నిధుల మంజూరు చేయడంతో పనులను ప్రారంభించారు. కొడంగల్, నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకుపైగా సాగునీరు, 5.5లక్షల జనాభాకు తాగునీరు అందించేందుకు ఈ ఎత్తిపోతల పథకాన్ని రూపొందించారు. మెట్ట ప్రాంత భూములకు నీరందించేందుకు ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకంపై పలుమార్లు అధికారులతో హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి సమీక్షలు నిర్వహించి పనుల వేగవంతానికి ఆదేశాలు జారీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే దీన్ని పూర్తిచేస్తామని గత అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. కొడంగల్ ఎమ్మెల్యేగా గెల్చిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో ఎత్తిపోతల పథకం అమలుకు మార్గం సుగమమై నిధులు రానున్నాయి.

పొరుగు రాష్ట్రాల నుంచి పరుగులు తీస్తున్న కృష్ణమ్మ

మరాఠా, కన్నడ రాష్ట్రాల నుంచి పరుగులు తీసే కృష్ణా నది నారాయణపేట జిల్లా కృష్ణా నది మండలం తంగేడి వద్ద తెలంగాణలోకి ప్రవేశిస్తుంది. కృష్ణమ్మ పరుగుపెట్టేది ఉమ్మడి పాలమూరులోనే అయినా ఇక్కడ ఏ ప్రాంతానికి కృష్ణా జలాలు అందడం లేదు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలతో ఆయా ప్రాంతాలకు సాగునీరందిస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చినా అమలు కాలేదు. భీమా ప్రాజెక్టు 20టీఎంసీల నికర జలాల కేటాయింపులో రెండు దశల ఎత్తిపోతల ద్వారా 12.9టీఎంసీలు సరిపోతుందని అధ్యయనాలతో తేల్చారు. మిగతా 7.1టీఎంసీల జలాలను కొడంగల్, నారాయణపేట ఎత్తిపోతలకు కేటాయించారు. ఈ స్కీంను పూర్తిచేస్తే దుర్భిక్ష ప్రాంతాలకు నీరందుతుంది. భీమా ఫేజ్1 లిఫ్ట్ కింద నిర్మించిన భూత్పూర్ జలాశయం నుంచి నాలుగు దశల్లో ఎత్తిపోసి ఈ పథకాన్ని చేపట్టాలని ప్రతిపాదించారు. ఊట్కూర్, జాజపూర్, జయమ్మ చెరువు, కానుకుర్తి దగ్గర ఎత్తిపోతలకు నిర్ణయించారు. కొడంగల్ నియోజకవర్గంలోని జయమ్మ చెరువు మీదుగా కానుకుర్తి, లక్ష్మీపూర్, ఈర్లపల్లి, దౌల్తాబాద్, హస్నాబాద్, కొడంగల్, బొంరాస్‌పేట్ చెరువులను కలుపుకొని నిర్దిష్ట ఆయకట్టుకు నీరందించేందుకు ఈ స్కీంను డిజైన్ చేశారు.


నాయకులను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాధుసూదన్‌రెడ్డి

సంక్షేమ పథకాలతోనే కాంగ్రెస్‌లో చేరికలు

షాబాద్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధి తాళ్లపల్లికి చెందిన బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ సమ్మి పెంటయ్య, సీనియర్ నాయకులు రాజు, నర్సింలు, మరింత మంది కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ.. పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గుడిమాల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కావలి చంద్రశేఖర్, చేవెళ్ల ఏఎంసీ చైర్మన్ పెంటయ్య, మాజీ సర్పంచ్‌లు మహేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, బార్ల యాదయ్య, మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, గుండాల అశోక్, నాయకులు దండు రాహుల్, సుభాష్‌రెడ్డి, శేఖర్, గౌరీశ్వర్, వెంకటయ్య, మాధవరెడ్డి, అంజిరెడ్డి, రాజు, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఏడాది పాలనలో అద్భుత విజయాలు

ఆమనగల్లు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వమొచ్చిన ఏడాదిలో హామీలు నిలబెట్టుకుంటూ సంక్షేమం, అభివృద్ధిల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సామాజిక న్యాయం కోసం కృషిచేస్తుంటే ఓర్వలేని విపక్షాలు ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాలు చేసేందుకు కుయుక్తులు పన్నుతున్నాయని పేర్కొన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో గురువారం ఎమ్మెల్యే పర్యటించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. లబ్ధిదారులకు రూ.1.55లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై నాయకులు ఎమ్మెల్యేకు వినతి పత్రాలందజేశారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామం, తండాకు బీటీ రోడ్లు వేస్తామని చెప్పారు. నిరుపేదలకు ఇళ్లు కట్టిస్తామని, రేషన్ కార్డులు ఇస్తామని అన్నారు. ఎండకాలంలో తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అధికారులు ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. విపక్షాలు విమర్శలకే పరిమితం కాకుండా అభివృద్ధిలో ప్రభుత్వంతో కలిసి రావాలని నారాయణరెడ్డి కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీసీసీ మెంబర్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, హన్మానాయక్, చేగూరి వెంకటేశ్, శ్రీనివాస్, నరేశ్, అంజయ్య, శ్రీశైలం, అజీం, కాసు శ్రీనివాస్‌రెడ్డి, బిచ్యా, జగన్, ప్రభాకర్‌రెడ్డి, కిషన్ రెడ్డి, వస్పుల మానయ్య తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్లతో ఎరువుల పిచికారీ సులువు

యాచారం. ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): డ్రోన్లతో పంటలకు ఎరువులు పిచికారీ చేసుకుంటే సమయం, డబ్బు ఆదా అవుతాయని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త విజయ్‌కుమార్, భార్గవి అన్నారు. నానో ఎరువులు వాడితే నేల సారాన్ని కాపాడుకోవచ్చని చెప్పారు. గురువారం ధర్మన్నగూడలో పరిశోధన కేంద్రం, ఇక్రిసాట్ శాస్త్రవేత్తలు సంయుక్తంగా డ్రోన్‌తో ఎరువుల స్ప్రేపై అవగాహన కల్పించారు. డ్రోన్లు తక్కువ ధరకే లభ్యమవుతాయన్నారు. మొక్కజొన్న, పత్తి, వరి, కూరగాయలపై డ్రోన్లతో ఎరువుల పిచికారి సులభం అన్నారు. నానో ఎరువులు వాడితే డబ్బు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు చంద్రకాంత్, చౌహన్, సాయికుమార్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

మరమ్మతులకు రూ.2కోట్లు అవసరం

మర్పల్లి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి):మండలంలోని చెరువుల మరమ్మతులకు రూ.2కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు ఇరిగేషన్ ఈఈ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గురువారం కొంశెట్టి ప్రాజెక్టు, పంచలింగాల చెరువు, తిమ్మాపూర్ చెరువు, నర్సాపూర్ చెరువులను పరిశీలించారు. చెరువుల్లో నీటి మట్టం ఎంతవరకు ఉందని, తూములు, కాల్వల మరమ్మతులు, చెరువుల్లో పేరుకుపోయిన పూడికతీతకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట డీఈ భాస్కర్‌గౌడ్, వాటర్‌మెన్ పాండు, రవీందర్ ఉన్నారు.

ల్యాండ్ పూలింగ్‌కు జాయింట్ సర్వే

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రతాప్‌సింగారంలో గురువారం ల్యాండ్ పూలింగ్‌పై అధికారులు సర్వే నిర్వహించారు. 150 మంది రైతుల నుంచి 151 ఏకరాలు సేకరించారు. జాయింట్ సర్వే అనంతరం టెండర్ల ప్రక్రియ పూర్తిచేయనున్నట్లు తెలిపారు. ఉప్పల్ భగాయత్ తరహాలో ప్రతాప్‌సింగారంలో హెచ్ఎండీఏ వెంచర్‌ను అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, పరమేశ్, సత్యప్రసాద్, నవీన్, చంద్రశేఖర్, దేవానంద్ పాల్గొన్నారు.

పాడి రైతుల పరేషాన్!

(ఐదో పేజీ తరువాయి)

అవకతవకలు మొదలయ్యాయి. మదర్ డెయిరీ నిధులన్నీ కరిగిపోయాయి. చివరకు అప్పుల పాలై ఉన్న ఆస్తులను కూడా కుదవపెట్టారు. ఆస్తులు కుదవపెట్టి తీసుకున్న రుణాలకు వడ్డీ కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొంది. నెలకు దాదాపు 45లక్షల వడ్డీ కడుతున్నారు. రైతులకు చెల్లించాల్సిన డబ్బులు కూడా బ్యాంకులకే మళ్లిస్తున్నారు. దీంతో రైతుల పరిస్థితి అధ్వానంగా మారింది. పాడి రైతు ప్రయోజనాలను పట్టించుకునే నాథుడే లేడు. డిసెంబర్ నుంచి రైతులకు సకాలంలో బకాయిలు చెల్లించడం లేదు. బ్యాంకు రుణాలు సంగతి అటు ఉంచితే రైతులకే ఇప్పటి వరకు రూ.24 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇందులో కనీస స్థాయిలో కూడా చెల్లింపులు జరగకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో పాటు మదర్‌డెయిరీ పాల ధరను అమాంతంగా తగ్గించింది. గేదె పాలకు లీటర్‌కు రూ.3, ఆవు పాలకు లీటర్‌కు రూపాయిన్నర తగ్గించింది. ఈ నిర్ణయం కూడా రైతులకు శరాఘాతమేనని చెప్పాలి. బహిరంగ మార్కెట్‌లో పాలకు ఎంతో డిమాండ్ ఉన్న విషయం తెలిసిందే. కానీ మదర్ డెయిరీ తన తప్పిదాలతో చేసిన అప్పుల నుంచి బయటపడేందుకు పాల ధర తగ్గించి రైతులకు మరింత నష్టాన్ని కలిగిస్తోంది. కష్టాల్లో ఉన్న రైతులు మాత్రం పాల ధర తగ్గిస్తే తగ్గించారు కానీ మా బకాయిలైన విడుదల చేయాలని దీనంగా అడుగుతున్నారు. తాము పడుతున్న కష్టాలను ప్రభుత్వానికి తెలియచేసేందుకు రెండు రోజుల కిందట యాచారం మండలం కుర్మిద్ద గ్రామ రైతులు రోడ్డుమీద పాలు కుమ్మరించి తమ నిరసన తెలిపారు. చుట్టు పక్కల గ్రామాల రైతులు కూడా ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. పరిగి సొసైటీలోనే రూ. 80లక్షల బకాయిలు ఉండడం గమనార్హం. ఇదిలా ఉంటే అప్పుల ఊబి నుంచి గట్టెక్కేందుకు ఆస్తులను విక్రయించాలని నిర్ణయించిన మదర్ డెయిరీ పాలకవర్గం ఆ వైపు శరవేగంగా అడుగులు వేస్తోంది. అయితే ఈ నిర్ణయాన్ని కొందరు సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. ఈ వ్యవహారం తేలే వరకు రైతుల బకాయిలు మాత్రం చెల్లించే అవకాశాలు కనిపించడం లేదు. ప్రభుత్వం చొరవ తీసుకుంటేనే రైతులు బయట పడే అవకాశాలు ఉన్నాయి.

తగ్గిన పాల సేకరణ

మదర్ డెయిరీ కింద 432 సొసైటీలు ఉండేవి, అలాగే 32వేల మంది రైతులు సభ్యులుగా ఉండే వారు. 24 చిల్లింగ్ స్టేషన్లు ఉన్నాయి. గతంలో ఉమ్మడి నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లో దాదాపు లక్షన్నర లీటర్లు ప్రతీరోజు సేకరించే వారు. అయితే గడిచిన నాలుగేళ్లుగా పరిస్థితి తారుమారైంది. సకాలంలో పాల డబ్బులు చెల్లించకపోవడంతో రైతులు క్రమేపీ ప్రైవేటు కంపెనీల వైపు వెళ్లిపోతున్నారు. దీంతో సొసైటీల సంఖ్య 300వరకే పరిమితమైంది. పాల సేకరణ కూడా గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం ఉమ్మడి నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లో రోజుకు 65వేల లీటర్ల మాత్రమే సేకరిస్తున్నారు. గతంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్రతి రోజూ 50వేల లీటర్లకుపైగా పాలసేకరణ జరిగేది. ఇపుడు 10వేల లీటర్లలోపుగానే పాల సేకరణ జరుగుతోంది. ఇదే పరిస్థితి ఇంకా కొనసాగితే ఈ రైతులంతా ప్రైయివేటు డెయిరీలను ఆశ్రయించే అవకాశం ఉంది.

బోనస్ ఊసే లేదు

గతంలో పాడి రైతులకు లీటర్‌కు రూ.4 బోనస్ ఇచ్చారు. అయితే కొంత కాలంగా బోనస్ నిలిపివేశారు. దీనికి తోడు పాల రేటు కూడా గణనీయంగా తగ్గించేశారు. వాస్తవానికి బహిరంగ మార్కెట్‌లో పాలధరలు తగ్గిన దాఖలాలు లేవు. పాల ధర తగ్గించి అమ్మినా మదర్‌డెయిరీకి పాలు విక్రయించే రైతులకు ఎలాంటి మేలు జరగడంలేదు. పైగా తాము అమ్మిన పాలకు డబ్బులు కూడా సకాలంలో ఇవ్వడం లేదు. పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల్లో పాలు విక్రయించిన రైతులకు నెలకు రెండు సార్లు అంటే ప్రతి నెల 5వ తేదీన తరువాత 20వ తేదీన చెల్లింపు చేసేవారు. కానీ నాలుగేళ్లుగా ఈ అనవాయితీ ప్రకారం చెల్లింపులు జరగడం లేదు. ఇపుడు పరిస్థితి మరింత దారుణంగా మారింది. డిసెంబర్ నుంచి రైతులకు ఒక్క రూపాయి కూడా ఇంత వరకు చెల్లించ లేదు

బకాయిలు చెల్లించి ఆదుకోవాలి

మా గ్రామంలో రైతులంతా 25 ఏళ్ల నుంచి మదర్ డెయిరీకే పాలు అమ్ముతున్నాం. పాల ఉత్పత్తి పెరగడంతో మా గ్రామంలోనే సొసైటీ ఏర్పాటు చేసుకున్నాం. రైతులంతా నమ్మకంతో నన్ను కుర్మిద్ద సొసైటీ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. మా సొసైటీ నుంచి ప్రతి రోజూ 1700 లీటర్ల పాలు సేకరించి మదర్ డెయిరీకి పంపుతున్నాం. బయట ప్రైవేటు కంపెనీలు పాలకు ఎక్కువ ధర ఇస్తామన్నా, ఇతర ప్రయోజనాలు చేకూరుస్తామన్నా రైతులు మదర్‌డెయిరీని వదలలేదు. అయితే గడిచిన నాలుగేళ్లుగా మదర్ డెయిరీ సకాలంలో రైతులకు చెల్లింపులు చేయడం లేదు. గతంలో లీటర్‌కు నాలుగు రూపాయలు బోనస్‌గా ఇచ్చేవారు. ఇప్పుడు ఆ డబ్బులు రావడం లేదు. డిసెంబర్ నుంచి పాల బకాయిలు చెల్లింపులు పూర్తిగా నిలిచిపోయాయి. మా సొసైటీకి దాదాపు రూ. 40లక్షలు బకాయిలు రావాల్సి ఉంది. రైతులు ఇబ్బందులు పడుతుంటే సొసైటీలో ఉన్న అత్యవసర నిధులను మళ్లించి రైతులకు కొంత సర్దుబాటు చేశాం. అసలే మేము ఇబ్బందుల్లో ఉంటే మదర్ డెయిరీ పాల ధరను తగ్గించి మరింత నష్టం కలిగిస్తోంది. మదర్ డెయిరీకి పాలు సరఫరా చేసి ఇబ్బందులు పడుతున్న రైతులకు తక్షణమే బకాయిలు చెల్లించి ఆదుకోవాలి.

మహేందర్‌రెడ్డి, కుర్మిద్ద సొసైటీ చైర్మన్

మాజీ ఎమ్మెల్యే ప్రొసీడింగ్‌లన్నీ ఉట్టివే!

- మనోహర్‌రెడ్డి వచ్చిన తర్వాతే రూ.800కోట్ల పనులు
- డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రవీందర్‌గౌడ్



తాండూరు రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తాండూరు ఎమ్మెల్యేగా రోహిత్‌రెడ్డి ఉన్న సమయంలో అభివృద్ధి పనుల పేరిట నిధులు లేకున్నా ఉత్తుత్తి ప్రొసీడింగ్‌లు ఇచ్చి బీఆర్ఎస్ నాయకులను తప్పుబట్టించారని డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రవీందర్ గౌడ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. తాండూరు ఎమ్మెల్యేగా మనోహర్‌రెడ్డి గెల్చిన తర్వాతే అభివృద్ధి పనులకు నిజమైన ప్రొసీడింగ్‌లు, నిధులు మంజూరు చేశారని తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గానికి సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో రూ.800కోట్లు మంజూరు చేయించిన ఘనత మనోహర్‌రెడ్డిదే అన్నారు. తాండూరు మండలంలో గత ప్రభుత్వం అభివృద్ధి పనులకు ఇచ్చిన ప్రొసీడింగ్‌లు అన్నీ ఉత్తవేనని తేలడంతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయించారన్నారు. బెల్కటూర్ శివారులో రూ.3కోట్ల పైచిలుకు నిధులతో బ్రిడ్జి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకుడు వీరేందర్‌రెడ్డి పనికిరాని ఆరోపణలు చేయడం కరెక్టు కాదన్నారు. టీఆర్ఎస్ నాయకులు ఆరోపణలతో అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు అభివృద్ధి పనులపై తెలుసుకుని మాట్లాడాలని రవీందర్‌గౌడ్ అన్నారు.




బ్రహ్మోత్సవాలకు మల్లప్పగుట్ట మల్లికార్జునాలయం ముస్తాబు

- రేపటి నుంచి ఏడు రోజులు ఉత్సవాలు
- 25న శివపార్వతుల కల్యాణం

తలకొండపల్లి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం, దర్శనీయ స్థలమైన చెన్నారం మల్లప్పగుట్టపై గల మల్లికార్జునస్వామి ఆలయం శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఏటా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. మల్లికార్జునస్వామి ఆలయాన్ని దాతలు, భక్తుల సహకారంతో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా, దర్శనీయ క్షేత్రంగా తీర్చిదిద్దారు. ఐదేళ్ల క్రితం గుట్టపై శిల్పకళ ఉట్టిపడేలా ఆలయాన్ని నిర్మించి విగ్రహప్రతిష్ఠ చేశారు. ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు. సమీప గ్రామాలు, మండలాలు, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలిరానున్నారు. స్వామివారల కల్యాణం, అగ్నిగుండ మహోత్సవం, కడువ కార్యక్రమాలు ప్రముఖంగా నిర్వహిస్తారు. ఉత్సవాల వివరాల ను ఆలయ కమిటీ చైర్మన్ మ్యాకం పాండయ్య, కార్యదర్శి కె.మల్లారెడ్డి, చైర్‌పర్సన్ ఏమిరెడ్డి కౌసల్య, కార్యనిర్వాహకులు కల్లు పెంటారెడ్డి, గౌరవాధ్యక్షుడు ఏమిరెడ్డి పాండురంగారెడ్డి వివరించారు. 22న సాక్షి గణపతి విగ్రహ ప్రతిష్ఠ, 23న పూజలు, అభిషేకాలు, 24న నవమి వార్షికోత్సవాలు, ఏకవాద రుద్రాభిషేకం, 25న గణపతి పూజ, అగ్నిగుండాలు, 26న ఉదయం భ్రమరాంబమల్లికార్జునుల కల్యాణం, 27న కడువ(బోనాలు), 28న చక్రతీర్థం, మహా మంగళహారతి కార్యక్రమాలుంటాయని పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలకు ఆమనగల్లు నుంచి ఆర్టీసీ బస్సులు నడుపుతుందని తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరు కావాలని ఆమనగల్లు ఏఎంసీ మాజీ చైర్మన్ ఎన్.శ్రీనివాస్ రెడ్డి, నాయకులు వందన, పాండయ్య, స్వప్నభాస్కర్‌రెడ్డి, రమేశ్‌నాయక్‌లు కోరారు.

యాప్రాల్‌లో ప్రణాళిక

● అనంతరం చిలుకూరుకు వీరరాఘవరెడ్డి సైన్యం

- మూడు రోజులు కొనసాగిన పోలీసు విచారణ
- నిజాలు రాబట్టిన పోలీసులు
- నేడు జ్యుడీషియల్ రిమాండ్

మొయినాబాద్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌పై దాడి కేసలో ప్రధాన నిందితుడు వీరరాఘవరెడ్డిని విచారణ కోసం మూడు రోజులు కస్టడీకి తీసుకున్న పోలీసులు విచారించారు. దాడికి సంబంధించిన విషయాలు పోలీసులకు వివరించాడు. రెండు రోజులుగా మొయినాబాద్ పీఎస్‌లో ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమారెడ్డి సమక్షంలో విచారణ చేశారు. గురువారం చివరిరోజు రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ వద్ద విచారణ జరిగింది. మూడు రోజులు పోలీసులు అడిగిన ప్రశ్నలకు వీరరాఘవరెడ్డిని బెరుకు లేకుండా సమాధానం చెప్పినట్లు తెలిసింది. హిందూధర్మ పరిరక్షణ, రామరాజ్యం స్థాపించాలన్నదే తన ఆశయంగా ఓ సంస్థను ఏర్పాటు చేసుకొని సైన్యాన్ని ఏర్పర్చుకొని దాడికి పాల్పడినట్లు విచారణలో చెప్పినట్లు సమాచారం. తన కుటుంబ నేపథ్యం, దాడికి గల కారణాలు పోలీసులకు వివరించినట్లు తెలిసింది.

పక్కా ప్లాన్ ప్రకారమే ...

చిలుకూరుకు వచ్చే ముందు వీరరాఘవరెడ్డి తన రామరాజ్యం సభ్యులతో యాప్రాల్‌లోని ఓ ఇంట్లో సమావేశమయ్యాడు. రెండురోజులు అక్కడే ఉన్నారు. రామరాజ్యం లక్ష్యాల గురించి వారికి వివరించాడు. అర్చకుల వద్దకు వెళ్లినప్పుడు అనుసరించాల్సిన విధానంపై బోధించాడు. ప్రణాళిక రూపొందించుకున్న తరువాతే చిలుకూరుకు వచ్చారు. గురువారం పోలీసులు వీరరాఘవరెడ్డిని యాప్రాల్ తీసుకెళ్లారు. సమావేశమైన ప్రదేశం, అక్కడి పరిసరాలను పరిశీలించారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా వెనకడుగు వేయం అని సభ్యులతో ప్రమాణం చేయించాడు. అనంతరం వీరరాఘవరెడ్డి ఉండే మణికొండలోని అతడి ఇంటిని పరిశీలించారు. అక్కడ కొన్ని ఆధారాలు లభించినట్లు తెలిసింది. పోలీసు కస్టడీలో తెలుసుకున్న అంశాల నివేదికను శుక్రవారం కోర్టుకు సమర్పిస్తారని తెలిసింది. అలాగే వీరరాఘవరెడ్డిని కోర్టులో హాజరుపర్చనున్నారు. అక్కడి నుంచి నిందితున్ని జైలుకు పంపుతారని సమాచారం.

కూతురిపై తండ్రి అసభ్యకర ప్రవర్తన

- బాలిక ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు

ఆదిభట్ల, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కన్న కూతురిపై అసభ్యకరంగా ప్రవర్తించిన తండ్రిపై పోక్సో కేసు నమోదైంది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లాకు చెందిన ఓ కుటుంబం బతుకుదెరువు కోసం ఏడేళ్ల కింద బాలాపూర్ మండలం కుర్మల్‌గూడకు వచ్చింది. కూలి పనులు చేసుకుంటున్నారు. వారికి ఒక అమ్మాయి, ఇద్దరు కుమారులు. అమ్మాయి హాస్టల్‌లో ఉంటూ 9వ తరగతి చదువుతోంది. 2024 అక్టోబర్‌లో దసరా సెలవుల్లో ఇంటికొచ్చింది. ఆ సమయంలో బాలికకు టైఫాయిడ్ రావడంతో పాఠశాలకు వెళ్లడం ఆలస్యమైంది. ఒంటరిగా ఇంట్లో ఉండగా తండ్రి బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించి, నిద్రపోతున్నపుడు శరీరాన్ని తాకి కాళ్లుపట్టుకొని లాగాడు. బాలిక అరవగా నోరు నొక్కి, ఎవరికైనా చెబితే తనను, ఆమె తల్లినీ చంపేస్తానని బెదిరించాడు. ఇలా బాలికపై నాలుగుసార్లు అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఇంటికొచ్చిన ప్రతిసారీ ఇలానే ప్రవర్తించడంతో బాలిక ఆత్మహత్యాయత్నానికి యత్నించింది. తల్లి ప్రశ్నించగా జరిగినదంతా చెప్పింది. తండ్రి బాధ భరించలేక సైదాబాద్‌కు వెళ్లిపోయారు. తండ్రి అక్కడికీ వెళ్లి ఇలానే ప్రవర్తించగా తండ్రిపై కూతురు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తండ్రిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

పెరుగుతున్న కుక్కకాటు కేసులు

- మేడ్చల్ ప్రభుత్వాస్పత్రికి భారీగా బాధితులు
- జనవరిలో 372 మందికి వ్యాక్సిన్



మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ ప్రభుత్వాస్పత్రిలో కుక్క కాటుతో చికిత్స పొందుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. రోజూ సగటున పదికి తగ్గకుండా కుక్కకాటు కేసులొస్తున్నట్టు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. వీధి కుక్కల నియంత్రణకు పలు కార్యక్రమాలు చేపడుతున్నా కుక్కల సంచారం తగ్గడం లేదు. పిల్లలు, వృద్ధులు, మహిళలు ఎక్కువగా కుక్కకాటుకు గురువుతున్నారు. కుక్కకాటుకు గతంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం అందుబాటులో లేక ప్రైవేట్‌హాస్పిటళ్లలో, నగరంలోని గాంధీ, నారాయణగూడ, కోరంటి గవర్నమెంట్ ఆస్పత్రుల్లో చికిత్సపొందే వారు. అయితే పెరుగుతున్న కేసుల కారణంగా స్థానిక ప్రభుత్వాస్పత్రుల్లోనూ కుక్కకాటు వైద్యం అందిస్తున్నారు. 2025 జనవరిలో మేడ్చల్ కమ్యూనిటీ ఆస్పత్రిలో 372 మంది కుక్క కాటు చికిత్స పొందినట్టు అధికారులు తెలిపారు. రోజుకు కనీసం ఐదుగురికి యాంటీ రేబిస్ ఇంజక్షన్ వేస్తున్నామని వైద్యులు తెలిపారు. ఆస్పత్రిలో యాంటీ రేబిస్ ఇంజక్షన్లను ఉంచుతున్నామని చెప్పారు. అయితే పిచ్చి కుక్కలు కరిచిన వారికి, కుక్క కాటు గాయం తీవ్రంగా ఉన్న వారికి ఇచ్చే హిమినోగ్లోబిన్ ఇంజక్షన్ కోసం నగరంలోని గాంధీ, కోరంటి ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. ఈ ఇంజక్షన్ మేడ్చల్ ఆస్పత్రిలో నిల్వచేసే సౌకర్యం లేక అక్కడికి పంపుతున్నామని వైద్యులు తెలిపారు.



వీధి కుక్కల నియంత్రణేది?

వీధి కుక్కలను నియంత్రించడంలో మున్సిపల్ అధికారులు విఫలమవుతున్నారు. గతంలో ఆయా ప్రాంతాల్లో కుక్కకాటు కేసులు ఎక్కువగా నమోదవగా అధికారులు కుక్కలను పట్టి వాటికి బర్త్ కంట్రోల్ వ్యాక్సిన్ వేశారు. అయినా కుక్కలు భారీ సంఖ్యలో తిరుగుతున్నాయి. పిల్లలను, వృద్ధులను, మహిళలను కరుస్తున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు కుక్కలను పట్టి దూర ప్రాంతాల్లో వదిలేయడమో, లేదా మరోసారి వాటికి బర్త్ కంట్రోల్ చికిత్సలో చేయాలని ప్రజలు కోరుతున్నారు. పిచ్చి కుక్కలను వెంటనే పట్టుకొని దూర ప్రాంతాలను తరలించాలంటున్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


అంతారం శివాలయంలో కల్యాణోత్సవం

తాండూరు రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం అంతారం గ్రామ శివారులోని పెద్దేముల్ రోడ్డు మార్గంలో గల శివాలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. మహా శివరాత్రి సందర్భంగా గురువారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, కలశధారణ పూజలు నిర్వహించారు. అంతారం గ్రామానికి చెందిన లక్ష్మణ్, రేణుక, గోపాల్, సుమలత, నరేష్, పల్లవి, మరో ఇద్దరు దంపతులు శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. శివభక్తులు ఆలపించిన భజన కీర్తనలు ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో శివస్వాములు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.


ఆలయం ఎదుట ప్రతిష్ఠించిన ధ్వజస్తంభం

సహకార సంఘం.. లాభాలు ఘనం

- రూ.1.20కోట్ల ఆదాయంతో లాభాల్లోకి నవాంద్గీ సొసైటీ
- రైస్‌మిల్లు, పెట్రోల్‌బంకు ఏర్పాటుతో వ్యాపార రంగంలోకి అడుగులు


బషీరాబాద్‌లో నవాంద్గీ సొసైటీ భవనం

బషీరాబాద్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): నవాంద్గీ సహకార సంఘం పాలకవర్గం, సిబ్బంది నిరంతర సమష్టి కృషితో సంఘాన్ని లాభాల బాటలోకి తీసుకెళ్లి అభివృద్ధికి కృషి చేస్తున్నారు. రైతులకు, ప్రజలకు వివిధ రకాల సేవాలందిస్తూ, నిరంతరం పాలకవర్గం, అధికార సిబ్బంది అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.కోటీ 20లక్షల ఆదాయం సమకూర్చుకుని ఏన్నాడూ లేనివిధంగా ఆర్థికాభివృద్ధి సాధించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు, సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు విక్రయిస్తూ, క్రాప్, ఎల్‌టీ, గోల్డ్ లోన్లు వంటి వాటిపై రుణ సహకారం అందిస్తూ రైతుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. రైతుల సభ్యత్వంతో రూ.కోటి షేరింగ్ నిధులతో రూ.3.50కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లను సొంతం చేసుకుని లాభాలను ఆర్జిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మరోవైపు సొసైటీ ద్వారా వ్యాపార రంగంలోకి అడుగులు వేస్తున్నారు.


నాబార్డు నిధులతో నిర్మించిన రైసుమిల్లు, గోదాం

వచ్చిన ఆదాయంతోనే అభివృద్ధి

ఈ సంఘం పరిధిలో మొత్తం 36 గ్రామ పంచాయతీలున్నాయి. 4511మంది సభ్యులు ఉండగా, రుణాలు తీసుకున్న సభ్యులు 1081 మంది వరకు ఉన్నారు. సభ్యులకు సేవాలందిస్తే వచ్చిన ఆదాయంతో సొసైటీని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నారు. ఈ సంఘం ఆధ్వర్యంలో అన్నదాతలకు స్వల్పకాలిక రుణాలు రూ.5కోట్ల 34లక్షలా 61వేల 077, దీర్ఘకాలిక రుణాలు రూ.కోటీ 81లక్షలా 59వేల 765 రుణాల వరకు ఇచ్చారు. బంగారంపై 491 మందికి గానూ రూ.4కోట్ల 4లక్షలా 67వేల 216 వరకు తక్కువ వడ్డీకి రుణాలిచ్చి లాభాలు ఆర్జిస్తున్నారు.

వ్యాపార రంగంలో ముందడుగు

నవాంద్గీ సొసైటీకి నాబార్డు నిధులు రూ.2కోట్లు మంజూరు కాగా ఇందర్‌చెడ్ రోడ్డు మార్గం పక్కన రైసుమిల్లు, ధాన్యం నిల్వ కోసం 1500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం నిర్మించారు. ఈ పనులు దాదాపు పూర్తయ్యాయి. త్వరలో ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకుంటున్నారు. అదేవిధంగా సొసైటీ ద్వారా స్వయంగా ఆర్థిక వనరులు సమకూర్చుకుని వ్యాపారం మరింత పెంచుకునేందుకు ముందడుగు వేస్తున్నారు. ఈ క్రమంలో పెట్రోల్ బంకు నిర్మాణం, రూ.56లక్షల వ్యయంతో 1000మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం నిర్మాణాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గోదాం సొసైటీ భవనం పక్కన శరవేగంగా పనులు సాగుతుండగా, పెట్రోల్‌బంకు నిర్మాణం పనులు బషీరాబాద్ ప్రధాన మార్గం హెచ్‌పీ గ్యాస్ గోదాం వద్ద చేపడుతున్నారు. వీటిని త్వరలో అందుబాటులోకి తీసుకువచ్చి ఆర్థికాభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు.

సొసైటీ అభివృద్ధే లక్ష్యం



రైతులు, పాలకవర్గం, సిబ్బంది సహకారంతో సొసైటీ లాభాల బాటలో సాగుతోంది. రైతులకు ఏటా ఎరువులు, విత్తనాలు, రుణాలు సకాలంలో అందిస్తూ సమస్యలు లేకుండా చూడటంతోనే ఆర్థికాభివృద్ధికి బాటలు పడ్డాయి. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారం, తోడ్పాటుతో సొసైటీ ద్వారా రైసుమిల్లు, పెంట్రోల్‌బంకు భారీగా గోదాంలు నిర్మిస్తున్నాం. వీటితో ఆదాయం సమకూర్చుకుని రైతులకు సేవలు మరింత విస్తృతం చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం.

- వెంకట్‌రాంరెడ్డి, నవాంద్గీ సొసైటీ చైర్మన్

క్రైం కార్నర్

పుట్టిన రోజే తిరిగి రాని లోకాలకు!

- చెరువులో ఈతకు వెళ్లి యువకుడి మృతి


సూర్యదేవ్ మృతదేహం

కీసర రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు పుట్టిన రోజే తిరిగిరాని లోకాలకు వెళ్లిన ఘటన గురువారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నం, విశాలాక్షినగర్‌కు చెందిన ఒబ్బిలినేని సూర్యదేవ్(26) తన పుట్టిన రోజు సందర్భంగా మిత్రులను కలిసేందుకు ఈనెల 19న హైదరాబాద్‌కు చేరుకున్నాడు. తన ప్రణాళిక ప్రకారం తన మిత్రులు దినేష్, కాలేషా, లోహిత్, తేజలను అదే రోజు హైదరాబాద్‌లో కలుసుకున్నాడు. అందరూ కలిసి అర్ధరాత్రి వరకు వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం గురువారం రాత్రి 12గంటల తర్వాత కీసర పోలీస్‌స్టేషన్ పరిధి యాద్గార్‌పల్లిలోని గండి చెరువు సమీపంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అండర్ ద మూన్ పార్క్‌కు చేరుకున్నారు. తెల్లవారుజామున చెరువులోకి దిగారు. సూర్యదేవ్ ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోయాడు. ఈత రాకపోవటంతో నీట మునిగి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అన్నసాగర్ శివాలయ అభివృద్ధికి నిధులు


మహేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న శివస్వాములు

యాలాల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అన్నసాగర్ శివాలయం అభివృద్ధికి రూ.5లక్షల నిధులు అందిస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి అన్నారు. గ్రామానికి చెందిన శివస్వాములు మల్లారెడ్డి, రాము, మహేష్‌గౌడ్, శివకుమార్ గురువారం హైదరాబాద్‌లో మహేందర్‌రెడ్డిని కలిశారు. ఆలయ అభివృద్ధికి నిధులు అవసరమని వారు కోరగా స్పందించిన ఎమ్మెల్యే ఆలయానికి రూ.5లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల సర్దుబాటు

తాండూరు రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తాండూరు మండలంలో పంచాయతీ కార్యదర్శుల బదిలీతో వారి స్థానాల్లో ఇక్కడికి బదిలీపై వచ్చిన వారికి బాధ్యతలు అప్పగించినట్లు ఎంపీడీవో విశ్వప్రసాద్ తెలిపారు. జనగామలో పనిచేస్తున్న మల్లికార్జున్ బదిలీపై రాగా, ఆయనకు సంకిరెడ్డిపల్లి పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా కోటబాస్పల్లి పంచాయతీ కార్యదర్శి లాలప్పను పెద్దేముల్ మండల కేంద్రానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కుల్కచర్ల మండలం పటేల్ చెరువు తండాలో పనిచేస్తున్న శ్రావణి కోటబాస్పల్లి పంచాయతీ బాధ్యతలు అప్పగించారు. గోనూరు పంచాయతీ కార్యదర్శి రషీద్ పెద్దేముల్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో వీరశెట్టిపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న నజీర్‌కు గోనూరు పంచాయతీ అదనపు బాధ్యతలు అప్పగించారు. చెంగోల్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న సంతోషిణి బషీరాబాద్ మండల కేంద్రానికి బదిలీ కాగా, ఆమె స్థానంలో గౌతాపూర్ పంచాయతీ కార్యదర్శి ఫక్రోజీకి అదనపు బాధ్యతలు అప్పగించినట్లు ఎంపీడీవో తెలిపారు.

తండాల్లో సమస్యలపై కడా ప్రత్యేకాధికారి ఆరా


తండావాసులతో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొట్లావని, దేవులనాయక్ తండాల్లో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి గురువారం పర్యటించారు. ఆయా తండాల్లో నెలకొన్న సమస్యలను తండావాసులతో అడిగి తెలుసుకున్నారు. తండాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తండావాసులు పాల్గొన్నారు.

రాజ్‌భవన్ నుంచి వడ్లనందుకు పిలుపు

- కుటుంబ సమేతంగా గవర్నర్‌తో విందుకు హాజరు


గవర్నర్‌ను కుటుంబ సమేతంగా కలిసిన వడ్లనందు

వికారాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను కింది స్థాయి వరకు అమలు చేయడంలో, కరోనా లాంటి సమయంలో ప్రతి గ్రామానికి శానిటేషన్ అందించి ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న వడ్లనందును గవర్నర్ అభినందించారు. గురువారం రాజ్‌భవన్ నుంచి పిలుపు రావడంతో నందు కుటుంబ సమేతంగా గవర్నర్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ వడ్లనందు సేవలను కొనియాడారు. నందు ఫౌండేషన్ ద్వారా సొంత నిధులతో సేవలు చేయడాన్ని అభినందించారు. కరోనా సమయంలో సేవలు, పేద విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ అందించడం చనిపోయిన వారి కుటుంబాలకు అండగా ఉండడం అంత్రక్రియలకు, క్రీడలకు ఆలయాలకు, మహత్ముల విగ్రహాలకు సాయం చేయడం అభినందనీయమన్నారు.

ప్రతిపాదనలకే పరిమితం!

(5వ పేజీ తరువాయి)

ఆలయ బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. విశాలమైన కీసరగుట్టను, చుట్టూ ఉన్న ప్రాంతాలను అభివృద్ధి చేస్తే ఆధ్యాత్మికతతోపాటు భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంతోపాటు పర్యాటకంగా అభివృద్ధి చెందే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

రూ.75 కోట్లతో ప్రతిపాదనలు

కీసరగుట్ట ఆలయ అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 2017లో రూ.75 కోట్లతో జిల్లా అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. అప్పటి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి భూపాల్ రెడ్డి, ప్రఖ్యాత శిల్పి ఆనంద్‌సాయి ఆలయాన్ని సందర్శించినప్పటికీ ఇప్పటికీ పనులకు ముందడుగు పడలేదు. ఇటీవల దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కీసరగుట్టను సందర్శించి కీసరగుట్ట పర్యాటక కేంద్రంపై డీపీఆర్ సిద్ధం చేశామని చెప్పినా అదీ కార్యరూపం దాల్చేలేదు. ఆలయానికి మరో రెండు వైపులా గోపురాల నిర్మాణం, కీసరగుట్టకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం, నూర్‌మహ్మద్ చెరువుకు రోప్ వే, కోనేరు నిర్మాణం, ధర్మశాల, హుడా పార్క్ అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించారు. గుట్టపై ఉన్న పలు ఆలయాల అభివృద్ధితోపాటు అతిథి గృహాలు, గుట్ట చుట్టూ సుందరీకరణ పనులకు రూపొందించిన ప్రణాళికలు కాగితాలకే పరిమితమయ్యాయి.

బ్రహ్మోత్సవాలకే నిధులు

కీసరగుట్ట ఆలయ సంవత్సర ఆదాయం రూ.4 కోట్ల వరకు ఉంటుంది. ఇందులో 52 శాతం ప్రభుత్వానికి చెల్లించాలి. మిగతాదాంట్లో కాంట్రాక్ట్ లేబర్లకు పోనూ ఇతర ఖర్చులకు సరిపోతుంది. దీంతో ఆలయ అభివృద్ధికి నిధులు లేక దాతల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి. పాలకులు మారుతున్నా.. ప్రతిపాదనలు ముందుకు కదలడం లేదు. ఏటా మహా శివరాత్రి సందర్భంగా నిర్వహించే ఆలయ బ్రహ్మోత్సవాలకు ప్రభుత్వం నుంచి విడుదలవుతున్న రూ.50 లక్షలు తాత్కాలిక పనులకు మాత్రమే సరిపోతున్నాయి.


కీసరగుట్టలో అభివృద్ధికి నోచుకొని విష్ణుకుండిల హోమగుండాలు, మ్యూజియం

చొరవ చూపే నేతలు కరువు

విష్ణుకుండినుల రాజధాని కీసరగుట్ట పరిసరాలు పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో పేరుకుపోయాయి. విష్ణుకుండినులు ఏర్పాటు చేసిన హోమగుండాలు అభివృద్ధి చేసి, కొన్నేళ్లుగా మూలనబడిన మ్యూజియంను తెరిస్తే చరిత్ర కళ్ల ముందు కదలాడుతుంది. మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డితోపాటు పెద్దపెద్ద నేతలు జిల్లాలో ఉన్నప్పటికీ ఆలయ అభివృద్ధిని పట్టించుకోవడం లేదని జిల్లా ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రంలోనే రెండవ నేతగా పేరుగాంచిన దేవేందర్‌గౌడ్ హయాంలో జరిగిన అభివృద్ధే ఇప్పటికీ కనిపిస్తున్నది. స్వరాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అయిన తర్వాత మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో పాల్గొంటారని హుడావిడిగా హెలీప్యాడ్ నిర్మించినా సారు రాకపోవడంతో స్థానికులు నిరుత్సాహానికి గురయ్యారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కూడా గతంలో మాల్కాజ్‌గిరి ఎంపీ ఎన్నికల సమయంలో తన నామినేషన్ సెట్‌కు కీసరగుట్టలోనే పూజలు చేశారు. ఈ నెల 24 నుంచి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాల్లో సీఎం పాల్గొనేలా స్థానిక కాంగ్రెస్ నాయకులు కృషి చేసి, క్షేత్రం అభివృద్ధికి బాటలు వేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రతిపాదనలు మళ్లీ పంపించాం



కీసరగుట్ట ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నాం. ఆలయానికి ఆనుకొని అటవీ ప్రాంతం ఉంది. అందులో 250 ఎకరాలు కావాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం. ఆలయ అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించి కాంగ్రెస్ ప్రభుత్వానికి అందజేశాం. ఆలయ జోన్, రెసిడెన్షియల్ జోన్, ఫ్రీ జోన్‌గా మూడు విభాగాలుగా విభజించాం. కీసరగుట్టలో జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తాం. సీఎం కీసరగుట్టకు వచ్చేలా కృషి చేస్తాం.

- తటాకం నారాయణ శర్మ, ఆలయ చైర్మన్

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి


కార్యక్రమంలో శ్రీనిధి సీఈవో అభిజిత్

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని శ్రీనిధి కళాశాల సీఈవో కె.అభిజిత్ అన్నారు. మున్సిపాలిటీ యంనంపేట్‌లోని శ్రీనిధి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. పరిశ్రమలకు అవసరమ్యే పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తుల్జాభవానీ వేడుకలు


వేడుకల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ అంజనేయులు

కులకచర్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముజాహిద్‌పూర్ అనుబంధ గ్రామం చాకల్‌పల్లి తండాలో గురువారం తుల్జాభవానీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రతీ ఒక్కరు దైవచింతన అలవర్చుకోవడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి నర్సింహులు పాల్గొన్నారు.

పదవీకాలం పొడిగింపుతో రైతులకు మరింత సేవ చేసే అవకాశం


ధారూరు పీఏసీఎస్ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న సిబ్బంది

ధారూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పీఏసీఎస్ పాలకవర్గ పదవీ కాలాన్ని పొడిగించి మరో ఆరునెలలు రైతులకు సేవ చేసే అవకాశాన్ని కల్పించిందని పీఏసీఎస్ చైర్మన్ వై.సత్యనారాయణరెడ్డి తెలిపారు. ధారూరు పీఏసీఎస్ కార్యాలయంలో గురువారం సంఘ పాలకవర్గ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్‌లకు ధన్యవాదాలు తెలిపారు. సంఘం తరపున కామన్ సర్వీసు సెంటర్‌ను తెరువాలని తీర్మానించామని ఆయన చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశంతో సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన చెప్పారు. అనంతరం సంఘం చైర్మన్‌కు, పాలకవర్గం సభ్యులకు సీఈవో నర్సింహులు, సిబ్బంది శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు అబ్దుల్ కరీం, రవీందర్, టీ.గోపాల్‌రెడ్డి, ఎం.శివకుమార్ పాల్గొన్నారు.

కొడంగల్ పట్టణ కమిటీ ఎన్నిక

కొడంగల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రమాబాయి అంబేడ్కర్ కొడంగల్ పట్టణ కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అంబేడ్కర్ సంఘం తాలూకా అధ్యక్షుడు రమేశ్‌బాబు ఆధ్వర్యంలో కమిటీ అధ్యక్షురాలిగా మల్లమ్మ, ఉపాధ్యక్షురాలిగా భారతి, శిరీష, కృష్ణవేణి, ప్రధాన కార్యదర్శిగా వెంకటమ్మ, సహాయ కార్యదర్శిగా అంజమ్మ, డి.అంజమ్మ, కోశాధికారిగా సరస్వతి, అమృతమ్మ, కల్చరల్ కార్యదర్శులుగా ఆశమ్మ, నర్సమ్మ, పద్మమ్మ, శాంతమ్మ, అంజిలమ్మ, లక్ష్మిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సేవాలాల్ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి




సేవాలాల్ వేడుకల్లో ప్రసంగిస్తున్న విఠల్ నాయక్

పెద్దేముల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవాలాల్ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విఠల్ నాయక్ అన్నారు.జాగో బంజార వ్యవస్థాపకులు గోవింద్ సింగ్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన సేవాలాల్ మహారాజ్ 315వ అవతార మహోత్సవం కార్యక్రమాన్ని తాండూరు-ఇందూరు రోడ్డు మార్గంలో ఆధ్యాత్మిక ప్రదేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ సేవాలాల్ సేవలను నేటి తరానికి తెలియజెప్పాలని అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. జాగో బంజార వ్యవస్థాపకులు రాథోడ్ గోవింద్ సింగ్ మాట్లాడుతూ సేవాలాల్ జయంతి ఉత్సవాలను ప్రభుత్వం నామ మాత్రంగా నిర్వహిస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీ శంకర్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ మధులత, మాజీ సర్పంచ్ లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు. ఆధ్యాత్మిక కేంద్రంలో తక్షణంగా బోర్‌వేసి తాగునీటి సౌకర్యం కల్పించేందుకు రూ.లక్షా 11వేలు విరాళంగా ఇస్తున్నట్లు విఠల్‌నాయక్ తెలిపారు.

24న జాబ్‌మేళా

మూడుచింతలపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ యువకులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎంసీపల్లి ఎంపీడీవో గీతారెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్, డీఆర్డీవో ఆదేశాల మేరకు ఈ నెల 24న మూడుచింతలపల్లి గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ ప్రైవేట్ కంపెనీలో వివిధ ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నట్లు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏలో ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలన్నారు. పూర్తి వివరాల కోసం 8281739511 నంబరును సంప్రదించాలని కోరారు.

జాతీయ స్థాయిలో చైతన్య విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రతీ సంవత్సరం నిర్వహించే క్యాట్ ఒలింపియాడ్ జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో ఈ సంవత్సరం శ్రీ చైతన్య విద్యార్థులు 34ఎంపికయ్యారు. ఇందులో మ్యాథ్స్ ఫిజిక్స్ కెమిస్ట్రీ సబ్జెక్ట్‌లలో పరీక్షలు నిర్వహించగా మ్యాథ్స్‌లో 11మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వారిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం వెంకట్, అకాడమి స్టేట్ కోఆర్డినేటర్ సురేష్, జోనల్ కోఆర్డినేటర్ వీరస్వామి పాల్గొన్నారు.

రేపు తైబజారు వేలం

కీసర, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): కీసరగుట్టలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని రేపు (శనివారం) కీసరగుట్టలో తైబజారు వేలం నిర్వహిస్తున్నట్లు దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ నాగమణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10.30గంటలకు నిర్వహించే వేలంలో ఆసక్తి గలవారు ఉదయం 8.00గంటల నుంచి 10గంటల వరకు కీసరవాణీ క్యాంపు కార్యాలయంలో రూ.వెయ్యి రుసుము చెల్లించాలని సూచించారు. అదేవిధంగా రూ.51వేలు దరావత్తుగా డ్రాఫ్ట్ చలానా/నగదు చెల్లించి వేలంలో పాల్గొనాలని అధికారులు సూచించారు. వాహనాల పార్కింగ్‌కు ఆన్‌లైన్ టెండర్‌కు నేటి(శుక్రవారం) వరకు గడువు ఉందని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన

కోట్‌పల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కంకణాలపల్లిలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు గ్రామపంచాయతీ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీవో డానియల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో మొదటగా ఒక గ్రామాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణ ప్రక్రియ ప్రతీ గ్రామంలో విడతల వారీగా కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింగ్‌నాయక్, డీఈఈ సాజిద్‌అలీ, ఏఈ సిరాజోద్దీన్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఎస్‌ఐ ఆర్థిక సాయం

బషీరాబాద్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): టాకీతండాకు చెందిన రథోడ్ వెంకటేష్ కుమారుడు శ్రీరామ్(7) బుధవారం ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని తండా యువకుడు నరేష్, మరి కొందరు స్థానిక తాండూరు డిపో మేనేజర్ వద్దకు వెళ్లారు. మేనేజర్ అందుబాటులో లేడని తెలుసుకుని ఫోన్‌లో మాట్లాడి బాలుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. బస్సు యజమానిని పిలిపించి మాట్లాడతానని చెప్పడంతో వెనుదిరిగి వచ్చారు. అక్కడే ఉన్న ఎస్‌ఐ శంకర్ విషయం తెలుసుకుని మానవతా దృక్పథంతో బాలుడి అంత్యక్రియలకు రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పరిగి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ హరికృష్ణ తెలిపారు. శుక్రవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సరఫరా ఉండదని తెలిపారు. మాదారం, పేటమారాం, రంగాపూర్, బసిరెడ్డిపల్లి, నజీరాబాద్‌తండా, న్యామత్‌నగర్, రంగాపూర్‌తండా, సన్‌సిటీ కాలనీ, జయంతి కాలనీ, కేఆర్‌ఆర్‌కాలనీ, ఎస్‌ఆర్‌ఐ కాలనీ, మధురానగర్ కాలనీ, లక్ష్మీనగర్, ఆర్టీసీ కాలనీ, వేంకటేశ్వర కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సీఎం పర్యటనను జయప్రదం చేయాలి

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మినీ మేడారంగా పేరొందిన పోలెపల్లి ఎల్లమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సిడె కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారని కాంగ్రెస్ పార్టీ బొంరాస్‌పేట్, దుద్యాల మండలాల అధ్యక్షులు నర్సింహులుగౌడ్, అవుటి శేఖర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం 12గంటలకు పోలెపల్లి ఎల్లమ్మ దర్శనంతో మధ్యాహ్నం 3గంటలకు నారాయణపేట్‌లో జరిగే బహిరంగ సభకు బయల్దేరి వెళ్లనున్నట్లు తెలిపారు.

సీసీరోడ్డు పనులకు భూమి పూజ

కులకచర్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): హన్మ్యానాయక్ తండాలో సీసీ రోడ్డు పనులకు గురువారం నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో అఖిల భారత బంజార సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నేనావత్ రాహుల్‌నాయక్ హాజరయ్యారు. గతంలో తన తండ్రి రవీంద్రనాయక్ గిరిజన ప్రజల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారని, ఆయన అడుగు జాడల్లో నడుచుకుంటానని తెలిపారు. ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శ్రీశైల మల్లన్న సేవలో తాండూరు వాసి

తాండూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలోని శివభక్తుల సేవలో తాండూరుకు చెందిన శ్రీసాయి పుత్ర హోమ్స్ అండ్ డెవలపర్స్ అధినేత శంకర్‌యాదవ్ శ్రీశైలంలో అన్నదానం చేపట్టారు. బుధ, గురువారం శ్రీశైలం మల్లికార్జున, భ్రమరాంబ దర్శనానికి వచ్చే భక్తులకు అన్నదానం చేపట్టారు. 8ఏళ్లుగా అన్నదాన సేవలో కొనసాగుతున్నారు. 8వేల నుంచి 10వేల మంది భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 22వ తేదీ వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రముఖ పండితులు విశ్వం పంతులు శంకర్ యాదవ్‌కు శివుని విగ్రహాన్ని అందించి శాలువాతో సన్మానించారు. శ్రీశైలం ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి శంకర్ యాదవ్‌ను అభినందించారు.